ప్రజాశక్తి

శుక్రవారం 6 సెప్టెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆవఖండం భూముల్లో అక్రమ లే అవుట్

◆ అనుమతుల్లేకుండా పనులు ◆ ప్రభుత్వ ఆదాయానికి గండి ◆ ఎవరికీ పట్టని వైనం

అనుమతుల్లేకుండా లే అవుట్‌లో వేసిన రోడ్డు, ఇన్‌సెట్‌లో లే అవుట్ బోర్డు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జికి అతి సమీపంలో విశాఖపట్నం, అనకాపల్లి జాతీయ రహదారికి ఆనుకొని 24 ఎకరాల్లో అనకాపల్లిలో పేరొందిన శ్రీభవ్య శ్రీ డెవలపర్స్, ఆనంద్ ప్రొఫైల్స్ ప్రయివేటు లిమిటెడ్ వేస్తున్న అక్రమ లే అవుట్‌పై ప్రభుత్వ యంత్రాంగం అత్యంత ఉదారం చూపుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినా పట్టించుకోవడంలేదు. కళ్లముందే సర్కారుకు రావాల్సిన ఆదాయం పోతున్నా స్పందించడంలేదు. జివిఎంసి నుంచి పూర్తి అనుమతుల్లేకుండానే కాకతాంబనగర్ -3, శ్రీ సూర్య భగవాన్ హైటెక్ సిటీ పేర ఆన్ ప్రాసెసింగ్ అంటూ ఎల్‌పి నెంబరు 0006/2024తో జివిఎంసి అప్రూవల్ ఇచ్చినట్లు బోర్డు కూడా పెట్టి అమ్మకాలు జరుగుతున్నా మౌనంవీడ్డంలేదు. లే అవుట్ వేస్తున్న 24 ఎకరాల్లోని 21.65 ఎకరాల్లో లే అవుట్ పనులు జరుగుతున్నట్లు రెవెన్యూ సర్వేలో నిర్ధారించారు. అక్రమ లే అవుట్ అని తెలుసుకొని చాలా మంది వివిధ రూపాల్లో తమ శక్తిని బట్టి సొమ్ము చేసుకుంటున్నారు తప్ప అనకాపల్లి పట్టణ ప్రజలకు రాబోయే వరద ముప్పును గుర్తించి అక్రమ లే అవుట్ పనులు నిలిపివేసే పని చేయడంలేదు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమి కింద మార్పు చేసుకోవడానికి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను పూర్తిగా కట్టలేదు. లే అవుట్ అనుమతుల కోసం జివిఎంసికి కట్టాల్సిన చలానాలు లే అవుట్ మొత్తానికి చెల్లించలేదు. అయినా అక్రమ లే అవుట్ పనులు యథాతథంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారిలో ప్రయాణం చేసే ప్రతి ఒక్కరికీ లోతట్టు ప్రాంతంలో జరుగుతున్న ఈ పనులు కనిపిస్తున్నాయి. ఈ పనులు ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ, జివిఎంసి అధికారులకు కనబడుతున్నా తమ కెందుకన్నట్లు వెళ్లిపోతున్నారు.

వైసిపి ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ అక్రమ లే మిగతా 2లో..

సెమినార్‌లో ప్రసంగిస్తున్న కెకె.శైలజ

కేరళ ప్రజా పాలనను కేంద్రం అడ్డగిస్తున్నా..

అడుగు ముందుకే..

◆ రాష్ట్రాల అభివృద్ధికి ప్రజా ప్రత్యామ్నాయ విధానాలే కీలకం

◆ కేరళ పూర్వ ఆరోగ్య శాఖ మంత్రి కెకె.శైలజ

◆'కేరళ వామపక్ష ప్రభుత్వం - ప్రత్యామ్నాయ పాలన'పై సెమినార్

వార్త మెయిన్‌లో..

స్పందిస్తున్న హృదయాలు

▶ వార్త 2లో..

క్లిష్టంగా కూటమి ప్రభుత్వ ఇసుక విధానం

▶ వార్త 2లో..

మత్స్య ఉత్పత్తుల ఎగుమతిపై నేడు సదస్సు

▶ వార్త 2లో..

ఉత్తమ ఉపాధ్యాయులతో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఉత్తమ గురువులకు సత్కారం

వార్తలు 7లో..

విశాఖను సింగపూర్‌లా మార్చే ప్లాన్ !

◆ మాస్టర్ ప్లాన్ తయారీలో కీలక శాఖల భాగస్వామ్యం

◆ రైల్వే స్టేషన్ అభివృద్ధిపై సమీక్షిస్తున్నాం

◆ రైల్వే జోన్ రాబోతుంది.. స్థలం సిద్ధంగా ఉంది

◆ పిపిపిలో మెట్రో ప్రాజెక్టుకు ఏర్పాట్లు

◆ 'ప్రజాశక్తి'తో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్

మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖను సింగపూర్ సిటీలా మార్చే దిశగా మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి, నగరంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, మెట్రో రైలు రాకకు సన్నాహాలు, రైల్వే జోన్ తీసుకొచ్చే అంశాలన్నింటిపైనా తాను పనిచేస్తానని వెల్లడించారు. నివసించడానికి విశాఖ ఆనంద నగరం అనే అభిప్రాయం అందరిలో కలిగేలా భద్రత, గ్రీనరీని పెంచి, కాలుష్యం లేకుండా, ట్రాఫిక్ అవస్థలు తప్పేలా అన్ని శాఖల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందించే ప్రయత్నం చేస్తానన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

రైల్వే సమస్యలను ఎలా పరిష్కరిస్తారు ?

వైజాగ్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు గతంలో నిలిచి పోయాయి. వాటన్నిటినీ సమీక్షించి డవలప్‌మెంట్‌ను పట్టాలెక్కిస్తాను. పలు రైళ్ల దువ్వాడ వరకూ వేగంగా వచ్చి అక్కడ ఆగిపోవడం, విశాఖకు రావడానికి అధిక సమయం తీసుకోవడంతో ప్రయాణికులు ఎళ్లతరబడి ఆవేదనకు గురౌతున్నారు. ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారం చూపే ప్రణాళిక రూపొందిస్తున్నాను. ప్రస్తుత ప్రభుత్వానికి బ్రేక్ లేకుండా కొన్నాళ్లపాటు ప్రజలు పరిపాలించే అవకాశం ఇవ్వాలి. గతంలో పాలించిన చెడ్డ ప్రభుత్వానికి ప్రజలు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆవఖండం భూముల్లో అక్రమ లే అవుట్

అవుట్ పనులు కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్నాయి. ఆనాడు మంత్రి అమర్‌నాథ్, ఈనాడు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అనుచరులమంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొట్టి అనుమతుల్లేకుండా పనులు చేయించుకుంటున్నారన్న ప్రచారం జరుగుతోంది. కొనుగోలుదారులను ఆకట్టుకునేలా విశాలమైన సిమెంట్ రహదారులు నిర్మించి, 12 సెంట్లుకు ఒక ప్లాట్ చొప్పున వేసి అమ్ముకూలు చేస్తున్నారు. అనకాపల్లి సౌత్-2 రెవెన్యూ పరిధిలోని ఆవఖండం భూముల్లో సర్వే నెంబర్ 1392/1, 2లో 26 సెంట్లు, 1392/3లో 82 సెంట్లు, 1407/1లో 62 సెంట్లు, 1407/2లో 1.80 సెంట్లు, 1407/3లో 94 సెంట్లు, 1407/4, 5లో 54 సెంట్లు, 1407/6లో 25 సెంట్లు, 1408/1లో 1.18 సెంట్లు, 1408/2లో 1.54 సెంట్లు, 1408/3లో 46 సెంట్లు, 1409లో 1.59 సెంట్లు, 1410లో 2.67 సెంట్లు, 1411/1లో 2.88 సెంట్లు, 1411/2లో 1.03 సెంట్లు, 1412/6లో 79 సెంట్లు, 1414/1లో 1.87 సెంట్లు, 1414/2లో 90 సెంట్లు, 1414/3లో 40 సెంట్లు, 1414/4లో 69 సెంట్లు, 1414/5లో 12 సెంట్లు, 1414/6లో 30 సెంట్లు కలిపి 21.65 విస్తీర్ణంలో అక్రమ లే అవుట్ పనులు సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకొనివున్న ఈ విస్తీర్ణంలో వేస్తున్న ప్లాట్లలో అత్యధిక భాగం వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, కొంతమంది ప్రధాన పార్టీల రాజకీయ నాయకులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. దీంతో అక్రమమని తెలిసినా సక్రమంగా లే అవుట్ పనులు జరిగేలా వారు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

విశాఖను సింగపూర్‌లా మార్చే ప్లాన్ !

బ్రేక్ ఇవ్వడం శుభపరిణామం.

మీ విజన్, ప్రాధాన్యతలేమిటి ?

ఏ ప్రభుత్వమైనా, ప్రజాప్రతినిధి అయినా వ్యవస్థలను స్వేచ్ఛగా పనిచేయనివ్వాలి. ప్రజలు నాకు ఐదు లక్షల పైబలుకు మెజారిటీ ఇచ్చి విశాఖ నుంచి పార్లమెంట్‌కు పంపించారు. ఈ అర్హత, గౌరవం నాకు దక్కింది. విద్య, హెల్త్ కేర్, ఉపాధి అవకాశాలు అందరూ అందిపుచ్చుకునేలా విధానం తీసుకుంటాం. రైల్వే జోన్ త్వరలో రాబోతుంది. స్థలం కూడా ముడసర్లోవలో సిద్ధంగా ఉంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మెట్రో రైలును విశాఖకు తీసుకొస్తాం. మెట్రో రైలు పిపిపిలో చేపట్టాల్సి ఉంటుంది. రోడ్లు, బ్రిడ్జిలు, మెట్రో ఇలా ఈ వరసలో నిర్మాణం చేపట్టేలా ప్రాధాన్యమిస్తాం. మా ప్రభుత్వం దగ్గర అభివృద్ధి ఆలోచనలు చాలా ఉన్నాయి. ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. అందుకే పిపిపిలో ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా ప్రజలకు మౌలిక వసతుల కల్పన చేస్తాం. ఎథిక్స్, ఇతర పబ్లిక్ అకౌంట్స్ వంటి ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీల్లో ఉండేందుకు నాకు ఆసక్తి ఉంది.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎలా పరిరక్షిస్తారు?

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ ఆర్గనైజేషన్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. అందుకు తగ్గ కృషి, సహకారం ప్రభుత్వం ఇస్తుంది. సెయిల్‌లో కలపడం ద్వారా గనులకు ఇబ్బంది ఉండదు. నష్టాలకు అవకాశం ఉండదు. ప్లాంట్‌ను కాపాడుకోవాలనే మేనేజింగ్ డైరెక్టర్ ఉంటే బెస్ట్ ప్రాక్టీసెస్ అమలౌతాయి. దీనికోసం మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తోంది.

మీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఏం చెప్పాలనుకుంటున్నారు?

నా పార్లమెంట్ పరిధిలోగల ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కూటమి పార్టీల నేతలతో నిరంతర సమన్వయం ఉంది. సమస్యలపై అధ్యయనం చేస్తాను. ప్రజా సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తాను. ఇప్పుడికిప్పుడే నిర్దేశించుకున్న ప్రాజెక్టుల పూర్తి వెంటనే జరిగిపోదు. 2029 నాటికి ప్రభుత్వానికి పూర్తిగా పట్టు వస్తుంది.

విశాఖ పోర్టు - మెకాన్ లిమిటెడ్‌ల మధ్య ఎంఓయు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సాంకేతిక సహకారం అందించేందుకు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు మెకాన్ లిమిటెడ్‌తో విశాఖపట్నం పోర్టు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం మెకాన్ సంస్థ తన ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సేవలను పోర్టుకు అందించనుంది. గురువారం పోర్టు పరిపాలనా భవనంలోని మంతన్ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు సమక్షంలో పోర్టు, మెకాన్ లిమిటెడ్ ప్రతినిధులు అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా మెకాన్ సంస్థ పోర్ట్‌లో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడం, బొగ్గు, ఖనిజాలు, ఇతర సరుకులను, వాటి నిర్వహణ వ్యవస్థలను సమర్ధంగా నిర్వహించడానికి అనువైన పరిస్థితులను కల్పించే పనులను చేపడుతుంది. రాపిడ్ లోడింగ్ సిస్టమ్‌లు, రైల్వే సైడింగ్‌లు, మలిన జలాల శుద్ధి ప్లాంట్లు, ఎలక్ట్రికల్ సిస్టమ్‌లు, ఆటోమేషన్, విద్యుత్ పంపిణీ వంటి ప్రాజెక్టులకు సాంకేతిక సేవలను అందించనుంది. పోర్టులో ఉన్న అవకాశాలపై సవివరమైన ప్రాజెక్ట్ రిపోర్టులు, వ్యయాలను ప్రభావ అంచనాలు, డిజైన్, ఇంజినీరింగ్, ప్రొక్యూర్మెంట్ సహాయం, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, తనిఖీ సేవలు, స్వతంత్ర ఇంజినీరింగ్ నైపుణ్యాలు, కేసుల ప్రాతిపదికన సేవలను అందించనుంది.

మత్స్య ఉత్పత్తుల ఎగుమతిపై నేడు సదస్సు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : చేపల పెంపకందారులు, మత్స్యకారులు, పరిశ్రమల నిర్వాహకులు, మత్స్య ఎగుమతిదారులు, విధాన రూపకర్తలు, పరిశోధకులు మొదలైన వారితో సహ వివిధ వాటాదారుల మధ్య సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన కన్సల్టేషన్ సదస్సు నగరంలోని నోవోటెల్ వేదికగా జరగనుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్స్య ఎగుమతి ప్రమోషన్‌పై జరిగే వాటాదారుల కన్సల్టేషన్‌లో వివిధ అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఆవిష్కరణలు, ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ విధానాలు, విలువ జోడింపు, చేపల పెంపకందారులు, తీరప్రాంత వర్గాలకు సమ్మిళిత వృద్ధిని అందించటం ఈ సమావేశం ముఖ్య లక్ష్యమని వివరించారు.

స్పందిస్తున్న హృదయాలు

విజయవాడ వరద బాధితులకు విరివిగా విరాళాలు

నక్కపల్లి తహశీల్దార్‌కు సాయం అందిస్తున్న శంకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం, వాల్తేర్ క్లబ్ సభ్యులు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తో కలిసి జిల్లా కలెక్టర్‌కు గురువారం చెక్కులు అందజేశారు. వాల్తేర్ క్లబ్ సభ్యులు, విద్యా సంస్థల నిర్వాహకులు కలిసి ఈ సొమ్ము అందించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం విశాఖపట్నంలోని వాల్తేర్ క్లబ్ సభ్యులు, ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని వివిధ విద్యా సంస్థలు, ఇతర సంస్థలు కలిసి రూ.21,87,116 విరాళం ప్రకటించగా ఆ మేరకు సంబంధిత చెక్కులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తన ఛాంబర్‌లో స్వీకరించారు. కార్యక్రమంలో శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టిడిపి నేతలు గండి బాబ్జీ, పట్టాభిరాం, గొంప కృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి : ఇటీవల విజయవాడలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు జిల్లా కలెక్టర్ పిలుపు మేరకు జిల్లాలో ఉన్న పరిశ్రమల యాజమాన్యాలు తమ వంతు సహాయంగా 43 లక్షల 25 వేల రూపాయలను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. ఎసెన్షియా అడ్వాన్స్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 లక్షలు, రాంకీ ఫార్మాసిటీ ఇండియా లిమిటెడ్ రూ.10లక్షలు, ఆశుర్గన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ రూ.ఒక లక్ష, నోవోపార్ అడ్వాన్స్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.75 వేలు, డెల్టా మెరైన్ ఇంజనీర్స్ రూ.20వేలు, సాగర్ సిమెంట్స్ లిమిటెడ్ రూ.ఒక లక్ష, దక్కన్ ఫైన్ కెమికల్స్ ఇండియా లిమిటెడ్ రూ.10 లక్షలు, హెటిరో ఫౌండేషన్ రూ.10 లక్షలు, దల్వాకోట్ బయో ఫ్యూయల్ ప్రైవేట్ రూ.20 వేలు, అచ్చుతా లేబరోటరీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.10 వేలు, విజయశ్రీ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.5 లక్షలు విరాళాలు అందజేసినట్లుగా కలెక్టర్ తెలిపారు. కంపెనీలు విరాళంగా అందజేసిన ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపడం జరిగిందని చెప్పారు.

ఎంవిపి.కాలనీ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం రిలీఫ్ ఫండ్‌కు వివిఎంఆర్‌డిఏ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఒక రోజు బేసిక్ పే సుమారు రూ.6.76 లక్షలను మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ ద్వారా పంపించారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, గణాంకాధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజినీర్ భవాని శంకర్, డిఎఫ్ఒ శాంతి స్వరూప్ పాల్గొన్నారు.

ఆటోనగర్ పరిశ్రమల వితరణ

గాజువాక : విజయవాడ వరద బాధితులకు, వాసవ, ఐలా, పీవా ఆధ్వర్యంలో గాజువాక ఆటోనగర్ పరిశ్రమల నుండి సేకరించిన వివిధ వస్తువులు విజయవాడకు తరలించారు. రూ.2,25,000 విలువ గల, బిస్కెట్లు, వాటర్ బాటిల్స్‌ఇతర సామాగ్రి కలిపి విజయవాడకు పంపించారు. కార్యక్రమంలో కె.సత్య నారాయణ రెడ్డి, వాసవ అధ్యక్షులు పాండురంగ ప్రసాద్, సెక్రెటరీ రాంప్రసాద్, ట్రెజరర్ ప్రభాకర్, ఐలా సెక్రెటరీ చీకటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆహార సామగ్రి, పలు వస్తువులను పంపిస్తున్న ప్రతినిధులు

నక్కపల్లి: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మేడేటి శంకర్ ఆర్థిక సహాయాన్ని అందించి ఉదారతను చాటుకున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి 10 వేల రూపాయల చొప్పున, 20 వేల రూపాయల చెక్‌లను బుధవారం తహసీల్దార్ అంబేద్కర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, తుఫాన్ ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



సాధారణ గృహిణి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : వరద విలయంతో అతలాకుతలమైన విజయవాడలో బాధితులకు ప్రభుత్వపరంగా చేపడుతున్న సహాయక చర్యలకు తన వంతు సాయంగా జివిఎంసి 26వ వార్డుకు చెందిన సాధారణ గృహిణి భమిడిపాటి కల్యాణి రూ. లక్ష సాయం చెక్కును ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పిలుపునకు స్పందించి, తనవంతుగా వరద బాధితులకు సాయం చేస్తున్నానన్నారు. ఈ మేరకు రూ.లక్ష చెక్కును వార్డు టిడిపి అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత కల్యాణి మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ తమకు ఉన్నంతలో బాధితులను ఆదుకునేందుకు సాయపడాలని పిలుపునిచ్చారు.

క్లిష్టంగా కూటమి ప్రభుత్వ ఇసుక విధానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇసుక లభ్యత క్లిష్టంగా మారిందని, తక్షణం విశాఖలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లాలోని ఐదు క్వారీ లారీల యజమానుల సంఘాల నాయకులు అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కర్రి వెంకట రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందన్నారు. అయితే ఇసుక లభ్యత ఉండటం లేదన్నారు. అందువల్ల లారీల యజమానులుగా తాము, తమతో పాటు కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. బ్లాక్ మార్కెట్ పెరిగిందన్నారు. ఉచిత ఇసుక బూటకమని తెలిపారు. వినియోగదారులపై టన్నుకు రూ.3500 భారం పెరిగిందన్నారు. విశాఖ జిల్లాలో క్వారీ రీచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుమారు వెయ్యి లారీలతో ఇసుక రవాణా జరుగుతోందని, ఇసుక రవాణా చేస్తూ పది వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. సంఘం అధ్యక్షులు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక సరఫరా బంగారం అన్న చందంగా ఉందన్నారు. ఐదు రకాల పాలసీల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 2019 -2021 కాలంలో కూడా సిఎం జగన్ మోహన్ రెడ్డి చంద్ర బాబు మాదిరి విధానమే అమలు చేశారని గుర్తు చేశారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
విశాఖపట్నం బ్రాంచి ఆఫీసులు -
NAD కొత్తరోడ్, Opp.భాష్యం స్కూల్ రోడ్డు, గోపాలపట్నం.
-లలిత ప్లాజా, ఫస్ట్‌ఫ్లోర్, బోయ్‌లండన్ షాప్ వెనుక, ద్వారకానగర్.
- బిసి కాలనీ, బాలాజీనగర్, దుర్గమ్మ గుడిదగ్గర, అరిలోవ.
- హెరిటేజ్ సూపర్‌మార్కెట్ ఎదురు, అనకాపల్లి రోడ్డు, సబ్బవరం
-1st ఫ్లోర్, సీతారామనగర్, బస్ రోడ్, న్యూగాజువాక.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2024 ఉ 10-00 గం.లకు మా బ్రాంచి ఆఫీసు నందు 2159.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయినను విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి పైఅడ్రసులోని మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

అథరైజ్డ్ ఆఫీసర్

KANAKADURGA FINANCE LIMITED
#48-8-23/1, Lalitha Plaza, 1st Floor, Near Boy London Shop, DwarakaNagar, Visakhapatnam, PIN–530018, CONTACT PERSON, AREA MANAGER, NAGESH-89192-39576

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
EA 5/2024 in EP 18/2017
in OS 28/2002
Between
పైడా సూర్యానంద కృష్ణ దివ్యదీప్ & ఇతరులు పిటీషనర్స్
మరియు
ముదునూరి సుబ్బరాజు (Died) & ఇతరులు రెస్పాండెంట్స్
R27 సాగి ప్రసన్న
W/o. సాయి రామరాజు, వయస్సు 35 సం॥
MIG 2-80, వికాస్ నగర్, పెదగంట్యాడ, విశాఖపట్నం–530 044

పై నెంబరు EP.No.18/2017 లో E.A.5/2024 లో 1వ రెస్పాండెంట్ అయిన ముదునూరి సుబ్బరాజుగారి వారసులు పిటీషన్‌లో 27వ రెస్పాండెంట్ అయిన మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండ కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు పిటీషన్ ది. 17-09-2024 సం॥ తేదిన వాయిదా అయ్యి వున్నది. కావున పైతేదీన పైన తెలిపిన కోర్టులో ఉదయం 10.30 నిలకు హాజరై ఆక్షేపణలు తెలియ పరచుకోవలెను. లేని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానము చేయబడు నని ఇందుమూల ముగా తెలియపరచటమైనది.
(by Court Order)

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్,
కాకినాడ డోర్‌నెం. 12-1-40, జవహర్ వీధి, కాకినాడ
3-9-2024 ఫోన్: 0884-2367503, 98483 14081

సర్వేపల్లి, నేతాజీ విగ్రహాల ఆవిష్కరణ

విగ్రహాల ఆవిష్కరణలో వెంకటప్పడు, నారాయణ

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద పంచాయితీ, కృష్ణంరాజుపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణన్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ శిలా విగ్రహాలను గురువారం జెడ్‌పిటిసి గాడు వెంకట ప్పడు, సర్పంచ్ జివి నారాయణ ఆవిష్కరించారు. భీమిలికి చెందిన శ్రీవిద్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో వీటిని ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం, జి సత్యనారాయణ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను అభినందించారు

సాగు పైర్లు పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను జిల్లా వ్యవసాయ అధికారి డిఎఒ స్వామి ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయాధికారుల బృందం గురువారం పరిశీలించింది. సాగు పద్ధతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయవిధానంలో సాగు మెళకువలతోపాటు, అంతర పంటల సాగుపై ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది వంటాకుల రామారావు పాల్గొన్నారు

గణపతి ఉత్సవాలకు పందిరి రాట

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు శ్రీలీలాసుందరయ్యనగర్‌లో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో గురువారం గణపతి ఉత్సవాలకు పందిరి రాట వేశారు. కాలనీ మహిళలు పాల్గొని గణపతి ఉడుపురాటకు పసుపు, కుంకుమ పూసి భక్తిశ్రద్ధలతో వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు, విశాఖ పార్లమెంటు కమిటీ కార్యదర్శి ఏడువాక సన్యాసిరావు, కర్రి సూర్యనారాయణ రెడ్డి, వాసు, అప్పలరాజు, సాయి, కార్తీక్, అనంత్, సూర్య, తరుణ్, కొండలరావు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని ఆందోళన

ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఘోష హాస్పిటల్‌లో థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డ్సుకు బకాయి పడ్డ నాలుగు నెలల జీతాలను తక్షణం చెల్లించాలని కోరుతూ గురువారం సెక్యూరిటీ గార్డులు ఆందోళనకు దిగారు. విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. వారినుద్దేశించి విశాఖ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు మాట్లాడుతూ సాయి సెక్యూరిటీ కాంట్రాక్టర్ వద్ద విజిహెచ్ హాస్పిటల్‌లో 27 మంది సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి ఈ ఏడాది మే, జూన్, జూలై, ఆగస్టు నెలల జీతాలను కాంట్రాక్టర్ బకాయి పెట్టారని తెలిపారు. జిఒ నెంబర్ 43 ప్రకారం పెరిగిన డిఎతో కలుపుకొని జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలు జీతాలు ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి అద్దెకట్టలేక, నెలవారీ ఖర్చులకు డబ్బులు లేక, పిల్లల ఫీజులు కట్టలేక, డ్యూటీకి రానుపోను చార్జీలు లేక అప్పుల పాలవుతున్నారని తెలిపారు. తక్షణం జీతం పెంపు అమలు చేయాలని, మొత్తం జీతంపై పిఎఫ్, ఇఎస్ఐ రికవరీ చేయాలని కోరారు. వీరి బకాయి జీతాలను ప్రిన్సిపల్ ఎంప్లాయిర్ అయిన సూపరింటెండెంట్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జగదాంబ జోన్ సిఐటియు నాయకులు ఎం.సుబ్బారావు, హోంగార్డులు ఎ.శంకరరావు, బి.ధనలక్ష్మి, ఎం.భవాని పాల్గొన్నారు. అనంతరం హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒలకు వినతి పత్రాలు సమర్పించారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా సుదర్శన్

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరిస్తున్న సుదర్శన్

ప్రజాశక్తి- ఆనందపురం: జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆనందపురం మండలానికి చెందిన జిటివి సుదర్శన్ పట్నాయక్ అవార్డు అందుకున్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నగరంలోని వెంకోజిపాలెంలో నిర్వహించిన వేడుకలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ తదితరులు ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన సుదర్శన పట్నాయక్‌కు అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించి సత్కరించారు. సుదర్శన్ పట్నాయక్ ప్రస్తుతం గాజువాక బాలచెరువు పాఠశాలలో పనిచేస్తున్నారు.

పలుచోట్ల మట్టి గణపతుల పంపిణీ

పెందుర్తిలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు

గాజువాకలో విగ్రహాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పెందుర్తిలోవైసిపి అనకాపల్లి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షులు శరగడం చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొడ్డి శివ, శరగడం బుజ్జి, శరగడం గణేష్, మల్ల శ్రీను రాజు నర్సింగరావు కేటి నాయుడు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు

మధురవాడ : వినాయక చవితి సందర్భంగా సూపద రమణ తోడ్పాటుతో అల్లుడు రవికుమార్, కుమార్తె పూజదేవి ఆధ్వర్యంలో గురువారం మధురవాడ శిల్పారామంలో మధురవాడ మీడియా మిత్రులకు పిఎం.పాలెం సిఐ గేదెల బాలకష్ణ పాల్గొని మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.

తగరపువలస : పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక జంక్షన్‌లోగురువారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు స్థానిక వర్తక సంఘం అధ్యక్షులు దుర్గా మురళి, పట్టణ ప్రముఖులు రంగూరి సీతారామ దొర (రాంబాబు) అందజేశారు. సొసైటీ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, స్థానికులు సతీష్, సందీప్, చిన్న రెడ్డి, లీలా వతి తదితరులు పాల్గొన్నారు

ఆనందపురం: ఓఎస్సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో పెద్దిపాలెం హైవే పక్కన 500 మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసారు. ఫౌండేషన్ అధ్యక్షులు శివ దలాయి పాల్గొన్నారు.

గాజువాక.:ఎస్‌పిడిఐ సంస్థ వ్యవస్థాపకులు ఎం.శ్రీనివాసులు ఆదేశాలతో బాలచెరువు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల నెట్వర్క్ కన్వీనర్ జిలకర రమణ, భువనేశ్వరి దేవి ఆధ్వర్యంలో జరిగిన 76 వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు , జనసేన నాయకులు ఈశ్వరరావు, డాక్టర్ హేమలత, ట్రస్ట్ మెంబర్స్ డి.శేఖర్ దుర్గాప్రసాద్,ఎస్ సంతోష్, సూర్యనారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం జిలా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం జరిగింది. కలెక్టర్ చేతుల మీదుగా మట్టి వినాయక విగ్రహాలను జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

క్రెడాయ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో..

ఎంవిపి.కాలనీ : క్రెడాయ్ మహిళా విభాగం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం ఆర్‌కె.బీచ్‌లోని కాళీమాత ఆలయ సమీపంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రెడాయ్ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ నీరజ జామి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.కిరణ్మయి, మాజీ కో-ఆర్డినేటర్ సుమ బూరుగుపల్లి, క్రెడాయ్ సంయుక్త కార్యదర్శులు కంచెటి శ్రీనివాస్, పి.నరసింహారావు, సభ్యులు ఎం.కృష్ణమోహన్ రావు, కిరణ్ కుమార్, రాజన్న పాల్గొన్నారు.

నేత్రదాన అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం పెద జాలరిపేటలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎంవివి.మురళీమోహన్ నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తూ చనిపోయిన తర్వాత కళ్లను పూడ్చిపెట్టినా, కాల్చినా అమూల్యమైన వాటిని పాడుచేసినట్లేనని అన్నారు. దానికి బదులుగా మనం కళ్లను దానం చేసి మరో నలుగురికి చూపునివ్వాలని కోరారు. ఎవరెవరు నేత్రదానానికి అర్హులో తెలిపారు. అనంతరం పెద జాలరిపేట వీధుల్లో కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ నేత్రవైద్య విభాగం డాక్టర్ కాశీనాథ్ పాల్గొని నేత్రదానంపై వీడియోలను ప్రదర్శించారు. పెదజాలరిపేట అర్బన్‌హెల్త్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బందిఉన్నారు.

పౌరహక్కులపై అవగాహన

ప్రజాశక్తి-మాధవధార : మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కళాశాలలో గురువారం వినియోగదారుల హక్కులు. బాధ్యతలు, ఆహార కల్తీ పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి రాజేష్ శరత్ చంద్ర ,విజయభాస్కర్, సిఆర్‌సి ఇండియా నుంచి డిప్యూటీ కంట్రోలర్ ఇక్బాల్ జాఫర్, లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ నుండి రవికుమార్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు, ట్రాఫిక్ సిఐ దాశరథి, , ఉపాధ్యాయులందరూ పాల్గొన్నారు.

15లోగా ఇ-క్రాప్ నమోదు పూర్తి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో ఇ-క్రాప్ నమోదును ఈనెల 15లోగా పూర్తిచేయాలని తహశీల్దార్ శ్యాంప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్నప్రభ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, ఎఒ సంధ్యారత్నప్రభ మాట్లాడుతూ, మండలంలో ఇప్పటివరకు 4044 ఎకరాల్లో ఇక్రాప్ నమోదు జరిగిందన్నారు. తహశీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే అధికారి శ్రీనివాసరావు, ఎంఆర్ఐ మణికంఠపాల్గొన్నారు

పర్యాటక భూముల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడ, కాపులుప్పాడ ప్రాంతాల్లో పర్యాటక శాఖ భూములను గుర్తించే క్రమంలో గురువారం సర్వే చేశారు. పర్యాటక భూముల ఆక్రమణలను గుర్తించి, తొలగించేందుకు సర్వే జరుపుతున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి జ్ఞానవేణి తెలిపారు. న్యాయస్థానం ద్వారా క్లియరెన్స్ వచ్చిన భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఒ అండ్ ఎం ద్వారా ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న బేవాచ్ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్ పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కెవి.గంభీరం 11కెవి విద్యుత్ లైన్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా ఎపిఇపిడిసిఎల్ మూడవ జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 6న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎఇఇ సురేష్‌కుమార్ తెలిపారు. ఆ ఫీడర్ పరిధిలోని దుక్కవానిపాలెం, ఈగలవానిపాలెం, పాలవలస, మెట్టమీద పాలెం, తర్లువాడ, నగరపు పాలెం, గుడిలోవ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

విశాఖ కలెక్టరేట్ : నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఆపరేషన్ జోన్ - 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి మధురవాడ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో జోన్ 3 పరిధిలోని మధురవాడ, శివశక్తినగర్, ఆర్‌టిసి కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవల్లపాలెం, దుర్గానగర్, వాంబే కాలనీ, స్వతంత్రనగర్, గణేష్ నగర్, సాయిప్రియ లేఅవుట్, వల్లీనగర్, దుర్గానగర్, వుడా కాలనీ, ఎన్‌జిఒ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు యూత్ తైక్వాండో క్రీడాకారులు

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యూత్ తైక్వాండో క్రీడాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మధురవాడ యూత్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు హర్షవర్ధన్, సుధీర్, గాయత్రి, హాసిని, మణికంఠ హిమాన్షు ఈ నెల 8 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చినాయుడు తెలిపారు. మధురవాడకు చెందిన కనకదుర్గా క్యాటరింగ్ అండ్ డెకరేషన్స్ ప్రొప్రైటర్ కొర్రాయి సురేష్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ షిన్,ఆర్మ్ గార్డ్స్ అందజేసారని యూత్ తైక్వాండో కోచ్ మకానా సురేష్ తెలిపారు. విద్యార్థులు మరింతగా రాణించి, మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్ సుకుమార్, సంపత్‌లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

యంగ్ ఇండియన్ పార్లమెంట్‌లో కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ

సర్టిఫికెట్లతో కెజిబివి విద్యార్థినులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గీతం విశ్వ విద్యాలయంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన యంగ్ ఇండియన్ పార్లమెంట్‌లో పాల్గొన్న కెజిబివి విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. సదస్సులో అనేక జాతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించగా, తమ పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల విద్యార్థినులు సిహెచ్ దీపిక, ఆర్ స్నేహ, బి ప్రవల్లిక, కె చిన్నమ్మ, శ్రీతేజస్విని ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలను, డిఇఒ చంద్రకళ, సమగ్రశిక్ష ఎపిసి శ్రీనివాసరావు, జిసిడిఒ ఖలీషాబేగం ప్రశంసలు పొందారని ప్రిన్సిపల్ గంగాకుమారి తెలిపారు.

మట్టి గణపతుల తయారీపై శిక్షణ

మట్టి వినాయక విగ్రహాల తయారీలోవిద్యార్థులు

ప్రజాశక్తి -తగరపువలస : పర్యావరణ పరిరక్షణలో భాగంగా భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ఆధ్వర్యంలో గురువారం చిప్పాడ, అన్నవరం, పెద నాగమయ్య పాలెం, మూలకుద్దు పంచాయతీల పరిధిలోని వంద మంది పాఠశాల విద్యార్థులకు మట్టి గణపతుల తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో దివీస్ జిఎం ఎంఎస్ఎన్ రావు, సిఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ శ్రీనివాస్, కె నరసింహ, చిప్పాడ జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మట్టి విగ్రహాల వైపే ఉత్సవ నిర్వాహకుల చూపు

- పర్యావరణ హిత గణనాధులపై కమిటీల ఆసక్తి!
- ఆర్డర్లు గణనీయంగా పెరిగాయంటున్న తయారీదారులు
- శుభపరిణామమంటున్న పర్యావరణ ప్రియులు

కర్రలు, మట్టితో సుందరంగా సిద్ధమైన వినాయక విగ్రహం

మట్టి విగ్రహాల తయారీదారుడు పాల్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఈ ఏడాది గణనాధుని ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించేందుకు యువత, వినాయక ఉత్సవ కమిటీలు ఆసక్తి చూపుతున్నాయి. వాడవాడలా, వీధుల్లో ఎక్కడచూసినా ఈ ఏడాది గణపతి మండపాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో కాకుండా మట్టివిగ్రహాలకు వస్తున్న డిమాండ్, ఈ విధరంగా తయారుచేసిన ప్రతిమల కొనుగోలుకు చూపిస్తున్న ఆసక్తి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. కాగా ప్రజల్లో వచ్చిన ఈ మార్పు మంచి పరిణామని ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవేత్తలు అంటున్నారు.

గతంలో పోలిస్తే ఈ ఏడాది నగరంలో గణనాధుని ఉత్సవాల నిర్వహణలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పర్యావరణానికి హాని కలిగించని మట్టి, వాటర్ కలర్స్‌తో తయారు చేసిన విగ్రహాలనే ప్రతిష్ఠించి, పూజించేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. కోల్‌కతాకు చెందిన నోవాపాల్ నేతృత్వంలోని కళాకారుల బృందం తయారుచేస్తున్న నుంచి మట్టి విగ్రహాల అమ్మకాలకు వస్తున్న ఆదరణే దీనికి నిదర్శనం. కోల్‌కతాకు చెందిన నోవాపాల్ బృందం పాతికేళ్లుగా వినాయక విగ్రహాలను తయారుచేసి నగర వాసులకు అమ్ముతున్నారు. ఏటా వినాయక చవితికి రెండు నెలలు ముందుగానే నగరానికి వచ్చిన వీరు అక్కయ్యపాలెం, చిన్నూరు, రామచంద్ర నగర్, శంకరమఠం రోడ్డు పక్కన తదితర ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేసి విగ్రహాలను తయారుచేస్తున్నారు. నోవాపాల్ బృందం మట్టి, సరుగుడు కర్ర గడ్డి, వాటర్ కలర్స్ వినియోగించి పర్యావరణ హితమైన విగ్రహాలను రూపొందించి అమ్మకాలు చేస్తున్నారు. నిమజ్జనం తర్వాత సులువుగా నీటిలో కరిగిపోయి, మట్టిలో కలిసిపోయేలా గణేషుని విగ్రహాలు రూపొందించడం వీరి ప్రత్యేకత. పాతికేళ్లుగా ఇదే విధానంలో విగ్రహాలను తయారుచేసి అమ్మకాలు చేస్తుండగా, పాతికేళ్లుగా నగర వాసులు తమను ఆదరిస్తున్నప్పటికీ, ఈ ఏడాది వీరి విగ్రహాలకు వస్తున్న ఇండెంట్, డిమాండ్‌ను బట్టి మట్టి గణపతులను ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీలు ఎంత ప్రాధాన్యతనిస్తున్నాయో స్పష్టమౌతోంది.

రెండు అడుగులు ఎత్తు నుంచి 27 అడుగుల ఎత్తు వరకు మట్టి, కర్రలు, గడ్డితోనే పాల్ బృందం విగ్రహాలను చూడముచ్చటగా ఆకట్టుకునే రీతిలో తయారుచేస్తున్నారు. మంచి ఫినిషింగ్ కోసం కోల్‌కతా నుంచి ప్రత్యేకంగా మట్టిని తీసుకుని రావడం విశేషం. ఈ ఏడాది నిర్వాహకుల నుంచి వచ్చిన ఇండెంట్ మేరకు 30 వైవిధ్యభరితమైన విగ్రహాలను తయారుచేస్తున్నట్లు తెలిపారు మత్స్య గణపతి, సింహాద్రి అప్పన్న, శివగణపతి, ఆంజనేయ గణపతి, కృష్ణావతార గణపతి, త్రిమూర్తులు కాణిపాక గణపతి హైదరాబాద్ గణపతి, శివ పూజ గణపతి, మహారాజ గణపతి, మయూరి గణపతి, బాలాజీ గణపతి అయ్యప్ప గణపతి, ఇలా ఎన్నో వెరైటీ విగ్రహాలను రూపొందిస్తున్నారు. విగ్రహాల తయారీకి వినియోగించే ముడిసరుకు ధరలు పెరగడంతో విగ్రహాల రేటును పెంచకతప్పడం లేదని వీరంటున్నారు.

పర్యావరణానికి ఎటువంటి హాని చేయని విగ్రహాలను విశాఖ వాసులు కోరుకుంటు న్నారని, వారి అభిరుచికి అనుగుణంగానే వెరైటీ గణనాధులను తీర్చిదిద్ది అందిస్తున్నామని పాల్ తెలిపారు. కోల్‌కతాకు చెందిన మనోజ్ బేరా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో పోలిస్తే, మట్టితో విగ్రహాల రూపొందించ చడం చాలా కష్టమైన పని అన్నారు. 15 అడుగుల మట్టి బొమ్మ తయారీకి నలుగురు కళాకారులు 15 రోజులపాటు కష్టపడాల్సి ఉంటుందన్నారు సైజును బట్టి రూ.ఐదు వేలు నుంచి రూ. 90 వేలు వరకు తాము రూపొందించిన వినాయక విక్రయాలను అమ్ముతున్నా యమన్నారు. ఈ ఏడాది ఆర్డర్లు బాగా వచ్చాయని, నిర్వాహకులు కోరిన విధంగా విగ్రహాలను రూపొందించి ఇస్తే, వచ్చే ఏడాది తమకే ఆర్డర్ ఇచ్చేందుకు వారు ముందుకొస్తారని అంటున్నాడు.

కేరళ మాజీ మంత్రి శైలజకు ఘనసత్కారం

వేడుకలను ప్రారంభిస్తున్న కేరళ ఎమ్మెల్యే శైలజ

ప్రజాశక్తి -మాధవధార : విశాఖపట్నం కేరళ కళా సమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కేరళ ఎమ్మెల్యే, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, శైలజ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ ఇలా కేరళ కళాసమితితో కలిసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి వివరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం కేరళ కళా సమితి అధ్యక్షులు ఉనితన్, జనరల్ సెక్రెటరీ లైలా గణేష్, కోశాధికారి గణేష్, విశాఖపట్నంలోని కేరళ కళా సమితి కుటుంబాలు పాల్గొన్నారు.

వర్షాలకు కొండవాలులో కూలిన రక్షణ గోడ

హనుమంతువాక కొండవాలు ప్రాంతంలో కూలిన రక్షణ గోడ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల కురిసిన వర్షాలకు హనుమంతువాక కొండవాలు ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఒక ఇంటి ముందున్న రక్షణ గోడ కూలిపోయింది. ఆసమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక టిడిపి నాయకులు బుడుమూరి గోవిందు, బాదరు బాలరాజు సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమని జీవనం సాగిస్తున్నారు. ఎక్కడ కొండ చరియలు విరిగి పడి ఇళ్లమీద పడతాయోనని భయాందోళనలతో గడుపుతున్నారు. మరో తుఫాన్ పొంచి ఉన్న నేపథ్యంలో కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు దీనిపై తగు చర్యలు చేపట్టాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సూచించారు.

చెత్తపై యూజర్ ఛార్జీలను రద్దు చేయాలి

10న జివిఎంసి కౌన్సిల్‌లో అజెండా పెట్టాలని వినతి

మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాణాల

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి పరిధిలో విలువ ఆధారిత ఆస్తి పన్ను, అలాగే చెత్తపై విధించిన యూజర్ ఛార్జీలను రద్దు చేయాలని జివిఎంసిలో వైసిపి ఫ్లోర్‌లీడర్ బానాల సత్యసూర్య శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఈ నెల 10న జరగనున్న జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో ఆయా అంశాలను అజెండాగా చేర్చాలని కోరుతూ నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారికి గురువారం వినతి అందజేశారు. దీనిపై మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్పందిస్తూ, ఆస్తి విలువ ఆధారిత పన్నుల వసూలు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, అలాగే చెత్తపై యూజర్ ఛార్జీల వసూలు అంశాలపై కౌన్సిల్ సమావేశాల అజెండాలో చర్చకు చేర్చి, చర్చించడం ద్వారా వీటన్నింటిపైనా కౌన్సిల్ తీర్మానం చేయించి, వాటి రద్దు కోసం ప్రభుత్వ ఆమోదానికి పంపేందుకు తనవంతు చర్యలు చేపడతానని వెల్లడించారు.కాగా వైసిపి హయాంలోనే చెత్తపై యూజర్‌ఛార్జీలను వసూలు చేస్తుండగా, దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.

6 నెలల వేతన బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద విఓఎల సామూహిక వినతులు
- 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వెలుగు విఓఎలు

ప్రజాశక్తి-అనకాపల్లి

డ్వాక్రా సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్న వెలుగు వివోఏలకు ఈ ఏడాది మార్చి నెల నుంచి నేటి వరకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, తక్షణమే బకాయి వేతనాలు విడుదల చేయాలని వెలుగు విఓఎలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్ల) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి, సామూహిక వినతి పత్రాలను డిఆర్ఓ దయానిధి, డిఆర్డిఏ పిడి శచీదేవిలకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు వి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరుద్యోగులు అందులోను వివోఏలకు ఇస్తున్న జీతాలను ఆరు నెలలుగా ఇవ్వకపోతే వారు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. నేడు వివోఏల పని అంతా మొబైల్‌లోనే వివిధ యాప్‌ల ద్వారా జరుగుతుందని, దీనికి మొబైల్ రీఛార్జ్ చేసుకోవటానికి కూడా కష్టంగా ఉందని తెలిపారు. వివోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ నుండి వివిధ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చే అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న వెలుగు వివోఏలకు కనీస వేతనాలు లేక, ఇస్తున్న వేతనాలను కూడా సకాలంలో ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ వల్ల వివోఏలు ఆందోళన గురిచేస్తు దన్నారు. ఈ కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టుల పేరుతో వివోఏలపై తీవ్రంగా ఒత్తిడి పెంచి కొనుగోలుకై టార్గెట్లను ఇవ్వడం సరికాదన్నారు. 2019 నుంచి జిల్లాలో అనేకమందికి కొన్ని నెలల జీతాలు అందక లాంగ్ పెండింగ్లో పెట్టి నేటికీ చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జీతాలను విడుదల చేయాలని లేనట్లయితే భవిష్యత్తులో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విఓఎ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, వై లక్ష్మి, రాము, పుష్ప, భవాని, దమయంతి, రమణ, పద్మ , సత్యం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

గంజాయిపై పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లా ఎస్పీ ఎం.దీపిక

ప్రజాశక్తి - యలమంచిలి

గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట చర్యలు తీసుకోవాలని, పదే పదే కేసులు నమోదవుతున్న వ్యక్తుల గురించి క్షుణ్ణంగా పరిశీలించి వారిపై నిఘా పెంచాలని అనకాపల్లి ఎస్పీ ఎం దీపిక సూచించారు. ఆమె గురువారం యలమంచిలి టౌన్ పోలీసు స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల వేదికకు వస్తున్న ఫిర్యాదుల్ని సత్వరం చర్యలు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మైనర్లు రోడ్డుపై డ్రైవింగ్ చేయకుండా అదుపు చేయాలన్నారు. గంజాయి వినియోగాన్ని కట్టుదిట్టంగా అరికట్టాలన్నారు. ఏళ్ల తరబడి నలుగుతున్న పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. రాజీ పడదగ్గ సివిల్ , క్రిమినల్ కేసుల్ని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ సబ్ డివిజన్ డిఎస్పీ కెవి.సత్యనారాయణ, స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ ధనుంజరావు, ఎస్సైలు కె.సావిత్రి, బి.రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

చెరువును తలపిస్తున్న తుమ్మపాల-చోడవరం రోడ్డు

తుమ్మపాల- చోడవరం రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి- అనకాపల్లి

అల్పపీడన ద్రోణి కారణంగా గురువారం కురిసిన భారీ వర్షానికి అనకాపల్లి పట్టణంతో పాటు మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనకాపల్లి అండర్ బ్రిడ్జి, ఫూల్ బాగ్ రోడ్డు, గుండాలు జంక్షన్, యూనియన్ బ్యాంకు, చిన్న బాబు కాలనీ, మార్టూరు జంక్షన్ వర్షపు నీటితో మునిగాయి. తుమ్మపాల- చోడవరం రోడ్డు చెరువును తలపిస్తోంది. మార్టూరు జంక్షన్ నుంచి బగులవాడ రోడ్డు వరకు భారీగా వర్షపు నీరు చేరి పంట పొలాలు రోడ్డు ఏకమయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భారీ వర్షాలకు రైవాడ కాలువకు గండి

సబ్బవరం : మండలంలోని కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. అంతకాపల్లి పంచాయితీ శివారు ఒమ్మివాని పాలెం వద్ద రైవాడ కాలువకు గండి పడింది. దీంతో ఆ నీరు గొంప ముత్యం పూరింటిలోకి చేరడంతో సామాన్లు తడిసిపోయినట్లు మండల టీడీపీ అధ్యక్షులు మిడతాడ మహాలక్ష్మి నాయుడు తెలిపారు. పినగాడి నుండి కోటపాడు వెళ్లే రోడ్డులో మొగలిపురం దగ్గరలో వరద నీరు రోడ్డుపై నుండి పొంగి పొర్లుతుంది. దీనితో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఆటోలు రాకపోకలకు ప్రజలు అవస్థలు పడ్డారు.

నీట మునిగిన పొలాలు

బుచ్చయ్యపేట : మండలంలో గల పలు గ్రామాల్లో బుధవారం, రాత్రి, గురువారం భారీగా వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరడంతో మండలంలోని మెట్ట ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో రైతులు వరి నాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే గురువారం కురిసిన వర్షాలకు పొలాల్లో నీరు భారీగా చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పినగాడి-కె.కోటపాడు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న నీరు

బుచ్చయ్యపేట మండలంలోని నీట మునిగిన వరి పొలాలు

వడ్డాది : బుచ్చయ్యపేట మండలంలోని బిఎన్ రోడ్డు విజయరామరాజుపేట సమీపంలో తాచేరుపై నిర్మించిన డైవర్షన్ కాజ్వే నీటి సామర్థ్యం మేరకు నిర్మించకపోవడంతో నీరు ముందుకు ప్రవహించకుండా వెనక్కి పొలాల్లోకి వచ్చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో విజయరామరాజు పేటకు చెందిన బీసెట్టి, కోరిబిల్లి వారి పొలాలు నీటి ముంపునకు గురై నష్టపోతున్నారు. డైవర్షన్ రోడ్డులో 6 లైన్లు గొట్టాలు వేయడంతో కాజ్వే చివరలో నీరు నిల్వ ఉండిపోతుంది. కనీసం పాత బ్రిడ్జికి సమాంతరంగా రోడ్డు చివరి వరకు పది లైన్లు గొట్టాలు వేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని రైతులు తెలుపుతున్నారు. ఆర్‌అండ్ బి అధికారులు స్పందించి కాజ్వే వద్ద నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, తమ పంట పొలాలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిశ్రమల సహకారంతో

30 వేల దోమ తెరలు పంపిణీ

- కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : ఇటీవల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా బీసీ/ ఎస్సీ /ఎస్‌టి/ హాస్టళ్లల్లో విద్యార్థులకు, గిరిజన మారుమూల ప్రాంతాల ప్రజలకు ఉచితంగా 10 వేల దోమతెరలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. హెటిరో ల్యాబ్స్ 2500, వేసువిన్ 2500, డెక్కన్ ఫైన్ కెమికల్స్ 2000, రిప్రో టెక్నిక్ 500, ఫోరస్ ల్యాబ్స్ 2000, వసంత కెమికల్స్1000, ఈసాయి ఫార్మా కెమికల్స్ 3500, అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ 2500, తనిష్ లేబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, యూనిట్ (9) 1000, అలివిరా యానిమల్ హెల్త్ లిమిటెడ్ 1000, కాన్సాయి నెరోలెక్ పెయింట్స్ లిమిటెడ్ 1000, ఏషియన్ పెయింట్స్ 500, టోయోట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 10,000 దోమతెరలను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కంపెనీల నుండి సుమారు. రూ.66 లక్షల విలువ గల 30 వేల దోమ తెరలను సేకరించడం జరిగిందని, వాటిని పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టినట్లుగా కలెక్టర్ తెలిపారు. అందులో 20వేల దోమతెరలను అల్లూరి జిల్లాకు పంపడం జరిగిందని, పది వేల దోమ తెరలు జిల్లాలో పంపిణీకి చర్యలు చేపట్టడం జరిగిందని చెప్పారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి- కె.కోటపాడు : పోషకాహారంతోనే తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సిడిపిఒ వి.మంగతాయారు అన్నారు. మండలంలోని పిండ్రంగి, గొట్లాం, సింగన్న దొరపాలెం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులు పౌష్టికాహార మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ పనిచేసే చోట్ల మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. మహిళా సంబంధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు బంగారు నాయుడు, రమేష్, అంగన్వాడీ కార్యకర్తలు ఏ జానకి, ఆర్ పైడితల్లమ్మ, వి నాగలక్ష్మి, పి వెంకటలక్ష్మి, ఎఎన్ఎం పార్వతి, సూపర్‌వైజర్లు ఎల్వీ సుశీల, ఎం రాములమ్మ ఆయా గ్రామాలకు చెందిన గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు

చెత్త ద్వారా ఎరువు తయారీ

ప్రజాశక్తి-కశింకోట : చెత్త శుద్ధి వల్ల ఎరువుగా తయారు చేసుకోవచ్చని ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు అన్నారు. గ్రామంలో చెత్త శుద్ధి తయారీ కేంద్రంలో గురువారం వాన పాములు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తడి పొడి చెత్తను జాగ్రత్త చేసి చెత్త కేంద్రానికి తీసుకొచ్చి బల్లుకు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు

సిఐటియు విరాళాల సేకరణ

కార్మికుల నుండి విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

విజయవాడ వరద బాధితులకు సహాయార్థం సిఐటియు ప్రతినిధులు గురువారం అచ్యుతాపురంలో విరాళాలు సేకరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని విజయవాడలో వర్షాలు వరదలు కారణంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సంతాపం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకునేందుకు చేస్తున్న సహాయ కార్యక్రమాలు సరిపోవటం లేదన్నారు. సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు బాసటగా సిఐటియు ప్రజా సంఘాలు ఇప్పటికే వరదల ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సహాయం చేస్తున్న సేవకులకు ఆర్థికంగా సామాజికంగా సహాయ సహకారాలు ప్రతి ఒక్కరూ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు జిల్లా కమిటీ సభ్యులు రాజాన సత్తిబాబు, రాజు నరసింగరావు నానాజీ ప్రభాకర్ తాతబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా భెల్ సిఐటియు

గాజువాక : విజయవాడ వరద విలయంలో తీవ్రంగా నష్టపోయిన బాధితులకు సహాయంగా బెల్ మెయిన్ గేటు వద్ద ఉద్యోగుల నుండి భెల్ సిఐటియు నేతలు విరాళాలను వసూలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి, జిటిపి ప్రకాష్ మాట్లాడుతూ, మానవతా దృక్పథంతో వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయాలని,, కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు, ఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ, భెల్ ఉద్యోగులు, ఇటువంటి విపత్తు సమయాల్లో సాయమందించడంలో ముందుంటారన్నారు. కార్యక్రమంలో కె.విజయ్ కుమార్ సిహెచ్ నారాయణ, బి కృష్ణమూర్తిచ చిన్నబాబు ఆర్ జనార్ధనరావు నారపరెడ్డి పాల్గొన్నారు. మొత్తం రూ.18,600 నిధి వసూలు చేశారు.

భెల్ వద్ద విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నేతలు

చేపల చెరువులను పరిశీలించిన మత్స్యశాఖ అధికారులు

- ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన నిర్వాహకులు
- అధికారుల తీరుపై సిపిఎం జిల్లా నేత వెంకన్న మండిపాటు

అధికారులు రాకముందు చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం, మత్స్యశాఖ అధికారులను నిలదీస్తున్న సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి

అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువులను కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని బుధవారం పత్రికల్లో వచ్చిన వార్తలకు మత్స్యశాఖ అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని చేపల చెరువులను పరిశీలించారు. అయితే చెరువుల నిర్వాహకులకు అధికారులు ముందస్తుగా సమాచారం ఇవ్వడంతో వారు హడావుడిగా చెరువుల్లోని వ్యర్థాలను తొలగించారు. చెరువులను పరిశీలించిన మత్స్యశాఖ అధికారిని ఈ చెరువులకు అనుమతులు ఉన్నాయా? లేవా? అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న అడగ్గా, ఆమె అడ్డగోలుగా సమాధానం చెప్పారు. ప్రతి చెరువుకు అనుమతులు ఉన్నాయని, లేని చెరువులకు జిపిఎస్ సర్వే చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇప్పటికే రెండు సార్లు నోటీసులు ఇచ్చామని, డైరెక్టుగా తమకు దొరకడం లేదని తెలిపారు. అయితే చెరువులపై గ్రైండింగ్ మీషన్లు ఉన్న మాట నిజమేనని, కాని వాటిని వాడటం లేదని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో సిపిఎం నేత వెంకన్న, అధికారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం వెంకన్న మాట్లాడుతూ మండలంలో ఏ ఒక్క చెరువుకు ఎటువంటి అనుమతులు లేకుండా దాదాపుగా 1500 ఎకరాల్లో అక్రమంగా చేపలు చెరువులు నిర్వహించి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అధికారులు వారి నుండి ప్రతి నెలా మామూళ్లు దండుకొని వెళ్ళి పోతున్నారని విమర్శించారు. ఇప్పటికే పది సార్లు నోటీసులు ఇచ్చారని, తహశీల్దార్ దగ్గర బైండవర్ కూడా చేశారని, అయినా చేపలపెంపకందార్లు తీరు మాత్రం మారడం లేదన్నారు. గతంలో రెవెన్యూ, పోలీసు, మత్స్యశాఖ, విజిలెన్స్ అదికారులు ఇలాంటి వారిని పట్టుకొని కేసులు పెట్టేవారని, కాని ప్రస్తుతం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి అక్రమ చేపలు పెంపకందార్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు ప్రాణాలు కాపాడాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఆర్ఎస్ మృతికి సిపిఎం సంతాపం

సత్యనారాయణరాజు చిత్ర పటానికి పూలమాల వేస్తున్న కోటేశ్వరరావు, శంకర్

ప్రజాశక్తి- అనకాపల్లి

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణరాజు మృతికి సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలియజేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు ఆర్ఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ రుద్రరాజు సత్యనారాయణరాజు ప్రజలకు, కమ్యూనిస్టు పార్టీ నేతలకు ఆర్ఎస్‌గా సుపరిచితులన్నారు. కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ తన యావత్ జీవితాన్ని సమాజసేవకే అంకితం చేశారని గుర్తు చేశారు. పీడిత ప్రజల విముక్తి కోసం, శ్రామిక వర్గ రాజ్యం కోసం ఆహారం కృషి చేశారన్నారు. ప్రజల కోసం ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి పోరాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీని విస్తరింప చేయటంలోనూ, సమస్యలపై సమరశీలంగా నడిపించడంలో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా రైతు ఉద్యమ నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శిగా, విద్యార్థి, యువజన, రైతురంగాలతోపాటు సిఐటియు జిల్లా కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు. ఏజెన్సీ భూపోరాటంల్లోనూ, జిల్లాలో జరిగిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. గ్రామ సర్పంచి స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభాపక్ష ఉపనాయకునిగా పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, సిపిఎం నాయకులు కె.ఈశ్వరరావు, బి.ఉమామహేశ్వరావు, డి.డి.వరలక్ష్మి, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి ఫర్నీచర్ వితరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయానికి పరవాడలో ఉన్న మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీ పర్నిచర్‌ను అందజేసింది. జిల్లా పోలీసు కార్యాలయానికి ఫర్నిచర్ కోసం జిల్లా ఎస్పీ ఎం.దీపిక మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీకి లేఖ రాయగా కంపెనీ ప్రతినిధులు తక్షణమే స్పందించి సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా జిల్లా పోలీస్ కార్యాలయానికి అవసరమైన విజిటర్స్ చైర్స్, ఎగ్జిక్యూటివ్ చైర్స్, ఏసీలు, ప్రొజెక్టర్లు సమకూర్చారు. వీటిని ఎస్పీ దీపికకు కంపెనీ ప్రతినిధులైన డిప్యూటీ మేనేజర్ కార్పొరేట్ అఫైర్స్ గౌరవ్, జనరల్ మేనేజర్ కార్పొరేట్ అఫైర్స్ హనీ రిజ్వాన్, డీజీఎం సురేష్, హెచ్.ఆర్ నరసింహులు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. మ్యాన్ కైండ్ ఫార్మా కంపెనీ ప్రతినిధులకు ఎస్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యరావు, వినోద్ బాబు, ఎస్సై రఘువర్మ పాల్గొన్నారు.

11న అరసం జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి- అనకాపల్లి : అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 11న అనకాపల్లి జరుగుతుందని సంఘం జిల్లా అధ్యక్షులు పడాల వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాదులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో జరిగే ఈ సభ సందర్భంగా అవాంత్స సోమ సుందర్ కవితలు, గరిమెళ్ళ సత్యనారాయణ కవితలు, కవితా స్రవంతి రెండు పుస్తకాలు ఆవిష్కరిస్తారు. ఎన్నిక అనంతరం జిల్లా అరసం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరుగుతుంది. సాహితీవేత్తలు అనకాపల్లి ప్రముఖులు అందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుని భార్యకు రూ.25 వేలు సహాయం

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు కందుల శ్రీరామ్మూర్తి భార్య గున్నయ్యమ్మకు రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పాము సూర్యనారాయణ, కె గోపాల్‌రావు, నంబా రమణ, బి.రామకృష్ణారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు వినతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను, గంగవరంస సంతోష్ గురువారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజ్ చాలా అవసరమని, సుమారుగా 200 గిరిజన గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ తరువాత డిగ్రీ చదవాలంటే ఎస్ కోట, చోడవరం, కొత్తవలస, వైజాగ్ లాంటి దూరప్రాంతాలకు వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ కళాశాలలో అత్యధిక ఫీజులు చెల్లించలేక చదువుని మధ్యలో ఆపేయవలసి వస్తుందని పేర్కొన్నారు. దేవరాపల్లిలో డిగ్రీ కాలేజీ అవసరాన్ని గుర్తించి మంజూరు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు.

మాలగెడ్డ దోబీఘాట్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి - గాజువాక రోడ్డులోని మాలగెడ్డ దోబీఘాట్ శిథిలావస్థకు చేరిందని, దాన్ని పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్ శివాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దోబీఘాట్‌లోని గతంలో నిర్మించిన రేకుల షెడ్, నుయ్యి, బట్టలుతికే బల్లలు, కుండీలు కొత్తగా నిర్మించాలని కోరారు. యలమంచిలిలోని అనేక రజక సంఘాలు బట్టలుతికే సౌకర్యాలు లేక ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రజకులకు సౌకర్యవంతమైన వసతులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : పోషన్ మహ కార్యక్రమంలో భాగంగా గురువారం పరవాడ 1, 3 అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యపైనా, పోషన్ బి- పడాయిపైనా అవగాహన కల్పించారు. 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలు, గర్భిణీ, బాలింతలు, కిశోర బాలికలకు, 45 సంవత్సరాలలోపు స్త్రీలకు రక్త పరీక్షలు చేయించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వి లలిత కుమారి, సూపర్వైజర్ ఎస్కె షకీలా, ఏఎన్ఎం కె రత్నం, అంగన్వాడీ టీచర్లు జి అర్జునమ్మ, కె పార్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కెజిబివిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేగాడలో గల కెజిబివి విద్యాలయంలో గురువారం 260 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కసింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతిరావు, గైనకాలజిస్ట్ నిహారిక పరీక్షించారు. జెనరల్ ఓపీ, గైనిక్ సమస్యలు ఉన్నవారికి చూసి వారికి మాత్రలు ఇవ్వడం జరిగింది. అవసరమైన వారికి స్కానింగ్‌లు రిఫర్ చేశారు. హిమోగ్లోబిన్, మలేరియా, డెంగ్యూ టెస్టులు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దొండా చంద్రకళ, సూపర్వైజర్ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది సుభాని, ఉదయలక్ష్మి, వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి సంతోషి, కిన్నెర విజయలక్ష్మి పాల్గొన్నారు.

డివైడర్ మధ్యలో తుప్పల తొలగింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి -చోడవరం రోడ్డులోని స్థానిక గుండాలు వీధి జంక్షన్ నుంచి తుమ్మపాల వరకు డివైడర్ మధ్యలో మట్టి , తుప్పలు తొలగింపు కార్యక్రమం సర్పంచు తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో బ్లేడు ట్రాక్టర్‌తో నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా డివైడర్ మధ్యలో తుప్పలు పెరిగిపోవడం, డివైడర్ కు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి ప్రయాణికుల కళ్లలో పడి తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉండేవి. దీనిపై స్థానికులు పలుమార్లు పంచాయతీకి వినతులు, ఫిర్యాదులు చేశారు. దీంతో స్పందించిన పంచాయితీ పాలకవర్గం, పంచాయతీ ఈవో ఈశ్వరరావు ట్రాక్టర్ బ్లేడు సహాయంతో గత మూడు రోజులుగా తొలగింపు కార్యక్రమం చేపట్టారు. కాగా ఈ కార్యక్రమాన్ని గురువారం ఎంపిడిఒ నరసింహారావు, పిఆర్ఏఇ ధర్మారావు పరిశీలించారు.

ఘనంగా మదర్ థెరిసా వర్ధంతి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణం మెయిన్ రోడ్ కన్యకా పరమేశ్వరి ఆలయం దగ్గర మదర్ థెరిసా ఫౌండేషన్ నిర్వాహకులు కర్రి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 27వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర కన్వీనర్ మళ్ల సురేంద్ర, సంఘ సేవకులు కాండ్రేగుల శ్రీరామ్ పాల్గొని మదర్ థెరిసా విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, అనకాపల్లి పట్టణ ప్రముఖులు పెంటకోట సుబ్రహ్మణ్యం, కర్రి సన్యాసి నాయుడు, సూరిశెట్టి సూకరాజు, ఆర్రెపు కామేష్, ముప్పన సుబ్రహ్మణ్యం, దాడి వాసు, వేగి కృష్ణ, కొయిలాడ గణేష్, భాను చంద్ర, షేక్ రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూలోకమాంబ పండగ

ప్రజాశక్తి -పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో శ్రీ భూలోకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సారె, చీరలు, నైవేద్యలతో, పురవీధులలో మేళ, తాళాలతో, బాజా బజంత్రీలు తో అమ్మవారిని ఊరేగింపుతో అమ్మవారి గుడి వరకు వచ్చి మూడు పులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, ఆర్ఇసిఐఎస్ మాజీ ఛైర్మన్ చల్ల కనకరావు, పైల హరీష్, వర్రీ హరి, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబను దర్శించుకున్న కొణతాల

ప్రజాశక్తి -కశింకోట : కసింకోట మండలం ఏనుగు తుని గ్రామంలో శ్రీ మరిడిమాంబ పండగ గురువారం జరిగింది. అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ విచ్చేసి మరిడమ్మ తల్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం కార్యకర్తలతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, కలగా సోమేశ్వరరావు, నైనంశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, జెర్రిపోతుల సూకునాయుడు, సిదిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి గురువారం ప్రారంభించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు కృషితో గ్రామ పంచాయతీ, ఎంపీపీ నిధులు సుమారు రూ.15 లక్షలతో ప్రహరీతో సహ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ వారాడ సత్యనారాయణను పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కొల్లి ఈశ్వరరావు, దేవి శంకర్, స్కూల్ కమిటీ ఛైర్మన్ వంజంగి సూర్యనారాయణ, గుల్లిపల్లి అర్జునరావు, స్థానిక నాయకులు సబ్బవరపు మాలిబాబు, పొట్లేల అచ్చిబాబు, సబ్బవరపు శివశంకర్, కంచిమాల అప్పారావు, ఉల్లి చింతాలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పును పున:సమీక్షించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పును పున:సమీక్షించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న అనకాపల్లిలో జరుగు మాలల సదస్సును జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ మండల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మండల కమిటీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు పరవాడ అప్పారావు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ జివి హర్ష కుమార్ హాజరవుతున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి అనకాపల్లి కెజెపి ఫంక్షన్ హాల్లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాటపల్లి అప్పారావు, కార్లి సాయి సుందరరావు, వేచలపు గంగాధరరావు, పతివాడ నాగభూషణం, మచ్చ రామారావు, మల్లేటి బుజ్జులు, పోటెల దేముళ్ళు, టి.శ్రీరామ్, రొప్పల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

విశాఖలో మాట్లాడుతున్న ఎంపి శ్రీ భరత్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని అనకాపల్లి, విశాఖ జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు.

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : విద్యార్థుల్లో ఆలోచన, ప్రశ్నించేతత్వం పెరగాలని, మారే కాలంతో పాటు ఉపాధ్యాయుల్లో మార్పులు రావాలని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఉపాధ్యాయులనుద్దేశించి పేర్కొన్నారు. గురుపూజోత్సవం వేడుకలు వెంకోజీపాలెం వద్దగల సిఎంఆర్ ఫంక్షన్ హాలులో గురువారం ఉదయం విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగాయి. ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి విగ్రహానికి శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌లతో కలిసి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని అన్నారు. మంచి విద్యాబోధన ఉంటే విద్యార్థులు పెరుగుతారని, అలాగే మంచి ఉపాధ్యాయులు విద్యార్థులకు జీవితాంతం గుర్తుండిపోతారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించి సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఎపిసి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎయులోని డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో గురువారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎ.నరసింహారావు హాజరయ్యారు. జాలాది రవి, ఉమాదేవి, వెంకటేశ్వర్లు, రమణమూర్తి, బొరుగడ్డ సుబ్బయ్య పాల్గొన్నారు.

తెలుగు శక్తి ఆధ్వర్యాన..

తెలుగుశక్తి ఆధ్వర్యంలో అంబికా సీగ్రీన్స్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులు బివి.రామ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్ని విద్యలు ఉన్నప్పటికీ గురువు లేనిదే ఏ విద్యా పరిపూర్ణం కాదన్నారు. వేలాది మందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న నగరంలోని 95 ఏళ్ల ప్రొఫెసర్ శాంతమ్మతో పాటు ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించడం గర్వంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రొఫెసర్ శాంతమ్మకు పద్మశ్రీ లేదా పద్మభూషణ్ ప్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ అతిథిగా పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులు ప్రొఫెసర్ శాంతమ్మ, ప్రొఫెసర్ బి.ప్రసాదరావు, పిల్లా నిర్మల (అనకాపల్లి)లను సత్కరించారు. కార్యక్రమంలో ఎయు మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహేశ్వరరావు, జనసేన నాయకురాలు పి.ఉషాకిరణ్, పాలూరి శేషమాంబ, కొల్లి రత్నకుమారి, వానపల్లి గాయత్రి, డాక్టర్ పప్పూర్ నికుంజ్, వి.వంశీబాబు పాల్గొన్నారు.

మధురవాడ : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఇన్‌ఛార్జి విసి ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు నివాళు లర్పించారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ప్రొఫెసర్ అనితారావు, ప్రొఫెసర్ నాగేంద్రకుమార్, ప్రొఫెసర్ కె.వేదవతి, ప్రొఫెసర్ రాధిక, గీతం లైబ్రేరియన్ డాక్టర్ శివప్రసాద్ పాండా పాల్గొన్నారు. భౌతిక శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ కవితా చందును ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు.

నర్సీపట్నంలో...

మధురవాడ తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వాకర్స్ పార్కులో టీచర్స్ డే సందర్భంగా వాకర్స్ పి. కనకప్రసాద్, పి. నాగమౌళి, దామోదరరాజు (యోగా టీచర్)లను సన్మానించారు క్లబ్ జాయింట్ సెక్రటరీ జి. లోవరాజు, షేక్ సుబాని పాల్గొన్నారు.

భీమునిపట్నం : తగరపువల స అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో అవంతి విద్యాసంస్థల విశ్రాంత డైరెక్టర్లు అగర్తల, పి ఎస్ అవధాని,ప్రిన్సిపాల్ డాక్టర్ బి మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ చంద్ర శేఖర్ పాల్గొన్నారు. భీమిలి సన్ టెన్ట్ లో ప్రతిభ కనబరిచిన 15 మంది విద్యార్థులకు జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహక బహుమతులు విద్యా సంస్థల అధ్యక్షులు లక్ష్మీ లావణ్య, కరస్పాండెంట్ కె శ్రీనివాసరావు అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణు మూర్తి, విశ్రాంత ప్రిన్సిపల్స్ బెనర్జీ, ఎం ఉపేంద్ర, పి వెంకటరావు, కామేశ్వరరావులను సన్మానించారు.

పెందుర్తి : శాఖ గ్రంథాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ యు వి రావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. చదువరులు విద్యార్థులు పాల్గొన్నారు

సీతమ్మధార : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అధ్యాపకులను మిలీనియం సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ గాది శ్రీధర్ రెడ్డి సత్కరించారు. సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ , సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

ఆనందపురం : స్థానిక ఎంపిపి స్కూల్లో జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ ,కుప్ప రామలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం అంజనీ కుమారి, సర్పంచ్ చందక లక్ష్మీ , ఎంపిటిసి కొట్టాడ రమాదేవి పాల్గొన్నారు

లోడగలవానిపాలెంలో ఉపాధ్యాయులు జామి బాబూరావును సత్కరించారు. నీళ్లకుండీల జంక్షన్‌లో స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ లెంక సురేష్ ,వైస్ ప్రిన్సిపల్ శ్రీవల్లి పాల్గొన్నారు.

వేములవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎస్సీ కాలనీ పాఠశాలల్లో టీచర్స్ డే వేడుకల్లో ఉపసర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శొంఠ్యాం వెంకట్ విద్యాపీఠ్ పాఠశాలలో కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థుల నృత్యప్రదర్శనలు, మెజీషియన్ చందు , వసంతల మాయాజాలం ఆకట్టుకుంది. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైద్యసిబ్బంది, పారిశు ధ్యసిబ్బందిని సత్కరించారు. అన్నదానం నిర్వహించారు.

సమాజ నిర్మాణంలో టీచర్ల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: దేశంలో మంచి సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి గురుపూజోత్సవంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చివరగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులకు, 17 మంది స్కూల్ అసిస్టెంట్లకు, 18 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు సర్టిఫికెట్లను, మెమెంటోలను బహూకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డిప్యూటీ డిఇఒ పి.అప్పారావు తపాల్గొన్నారు.

అనకాపల్లి మండలం తుమ్మపాల జెడ్‌పి హైస్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్ బలరామ్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి పాల్గొన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి. విజయబాబు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనకాపల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవరపాలెం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ మేనేజర్ కే స్రవంతి ఉపాధ్యాయులను సత్కరించారు. స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ స్థానిక కొండ మాస్టారు స్కూలు పూర్వ ప్రధానోపాధ్యాయులు కొణతాల నారాయణరావును ఘన సన్మానం చేశారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి విశ్రాంత వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు, విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం పూలమాల వేశారు. అనంతరం టీచర్లు, లెక్చరర్లకు అయ్యన్న విద్యాసంస్థల తరపున గృహోపకరణాలను, కానుకలుగా అందచేశారు. విశ్రాంత ఎంఇఒ దాట్ల చంద్రశేఖరవర్మ పాల్గొన్నారు. ఎంపీడీవో సమావేశం మందిరంలో ఎమ్మెల్యే మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, విశ్రాంత ఉపకులపతి ముర్రు ముత్యాల నాయుడు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఎన్ వీరాంజనేయులు, త్రినాధరావులను సన్మానించారు.

పరవాడ : మండల కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఎంఇఒలు ఎం దివాకరరావు, జి సాయి శైలజ, ఎంపిడిఒ హేమ సుందర రావు ఉపాధ్యాయులు ఎం సునీతని, పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం హైస్కూల్లో సోషల్ ఉపాధ్యాయుడు వై. శ్రీనివాసరావుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కాగా, ఈ అవార్డును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, డిఇఒ వెంకటలక్ష్మమ్మ చేతులు మీదుగా అందుకున్నారు.

దేవరాపల్లి : ఇంచార్జ్ ఎంఇఒ బి.పడాల దాసు, ఎంఈఓ-2 వి. ఉషారాణి ఆధ్వర్యంలో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కష్టమూర్తి పూలమాలలు నివాళులర్పించారు. ఉద్యోగ విరమణ చేసిన బోయిలకింతాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కాశీపురంలో రిటైర్డ్ హెచ్ఎం ఆదిరెడ్డి సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చిన కన్నబాబును సత్కరించారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి ఆధ్వర్యాన కళాశాల విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. తవ్వవానిపాలెం జెడ్‌పి పాఠశాలలో ఎంఈఓలు ఎస్.లక్ష్మణరావు, బిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను తెలుగుదేశం పార్టీ కొత్త శెట్టి వెంకటేష్ తదితరులు ఘనంగా సన్మానించారు.

మాడుగుల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ జయలక్ష్మి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేశారు.

తెలుగు శక్తి ఆధ్వర్యాన ఉపాధ్యాయులకు సన్మానం

నర్సీపట్నంటౌన్: వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ మిని స్టేడియంలో విశ్రాంత ఎంఈవో జేఎస్ఎన్ నాగేశ్వరరావు డాక్టర్ సర్వేపల్లి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. గబ్బాడ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు కె సోమేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తురకబడి) పీఎస్ టీచర్ ఎల్ సుగుణ, వాకర్స్ క్లబ్ లోని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ అల్లు అప్పారావు, ఉపాధ్యక్షులు ఎంవి రంగారావు, కుప్పిలి స్వామి, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ బాబీ,వి. గజ్జాలమ్మ తదితరులు పాల్గొన్నారు. వెంకునాయుడుపేట ఎంపీపీ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ టీచర్ రావాడ సునీత ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమెను ఎంఈఓలు తలుపులు, నాగేంద్ర, పాఠశాల హెచ్ఎం వీరమాంబ, ఉపాధ్యాయుడు గోపీనాథ్ అభినందించారు.

నర్సీపట్నంటౌన్: మండలంలో చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు పూడి స్వామి నాయుడుని స్థానికులు సత్కరించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులను మంచి విద్యార్థిగా తీర్చిదిద్దడమే కాకుండా ఎందరినో విద్యావంతులుగా తీర్చి దిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రామకృష్ణరావు, బంగారు పుష్ప పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నక్కపల్లి: మండలంలోని చినతీనార్ల గ్రామంలో అరుణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను శాలువాతో సత్కరించారు. పెదబోదుగల్లం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చోడిశెట్టి సత్యనారాయణ ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును అందుకున్నారు.

చీడికాడ: మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలు సూర్య కళావతిని ప్రధానోపా ధ్యాయుల శోభ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఉపాధ్యాయులు కమిటీ చైర్మన్ శ్రీను బాలు మాస్టర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగభూషణం సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

సర్వేపల్లి విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లులో ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బుధవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ చందక శ్రీను 20 వేల రూపాయలతో సర్వేపల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంతి ఉపాధ్యాయులు శ్రీపాద సత్యదేవ శర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ మేరకు ఆయనను స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేష్ ,సర్పంచ్ బొల్లం చంద్రరావు ,వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, హెచ్ఎంలు కవిత, రాజేష్, స్కూల్ కమిటీ చైర్మన్ లు గోవింద్, శ్రీను నాయకులు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని వరాహపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన తాటికొండ వెంకటరమణ, పోతు బంతి పైడిరాజు ఇరువురు పొట్టకూటి కోసం విశాఖ వెళ్లి ప్రమాదవసత్తు మృతి చెందారు. దీంతో వెంకటరమణ తల్లి వరలక్ష్మి, పైడిరాజు భార్య దేవి వీరి జ్ఞాపకార్థం నిధులు సమకూర్చి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్వేపల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని పాఠశాల చైర్మన్, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ వి మహేశ్వరరావు ఆవిష్కరించారు.

సర్వేపల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బాధితులకు సహాయం అందించేందుకు వెళ్లిన నేతలు

బాధితులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:విజయవాడ వరద బాధితులకు రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సైన్యం పేరిట పాయకరావుపేట నియోజకవర్గం నుండి పలువురు టిడిపి నేతలు ప్రత్యేక మినీ బస్సులో ఆహారం తీసుకువెళ్లి వరద బాధితులకు అందజేశారు. పార్టీ నేతలు లాలం కాశీ నాయుడు, కొప్పిశెట్టి బుజ్జి, అమలకంటీ అబద్దం, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్, చించలపు పద్దు వరద బాధితులకు బిస్కెట్ ప్యాకెట్లు ,వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు .

నర్సీపట్నం టౌన్:రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సహకారంతో విజయవాడలో వరద బాధితులకు ఆహారం, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు అభిమానులు పాల్గొన్నారు.

17న గొలుగొండ మండల సమావేశం

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 17 మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు గొలుగొండ ఎంపిడిఒ డేవిడ్‌రాజు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంకు ఎంపిపి గజ్జలపు మణికుమారి అధ్యక్షతన వహిస్తారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-రోలుగుంట:ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో మండలంలోని వడ్డిప, కొంతలం, కొవ్వూరు గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహ కారక్రమం నిర్వహించారు. లింక్ వర్కర్ స్కీమ్ సూపర్ వైజర్ టి.చందు మాట్లాడుతూ హెచ్ఐవి, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా కార్యక్రమాలు చేపడు తున్నామన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న చిట్టినాయుడు

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - చీడికాడ:జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండలంలోని చెట్టుపల్లి, సిరిజాం గ్రామాలలో మాడుగుల ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాడి రైతులను రైతు సేవా కేంద్రంలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకొని ప్రభుత్వం నుంచి చేపడుతున్న లింగ నిర్ధారిత వీర్యం, పశు భీమా పథకం, టీకా కార్యక్రమాలుపై తెలియ జేశారు. ఇప్పటివరకు మండలంలో 8200 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు, 240 ఆడ పెయ్యలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలియజేశారు. చీడికాడ పశు వైద్యశాల ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రామాల్లో ముమ్మరంగా శానిటేషన్ పనులు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండిపోవడం ,పారిశుధ్యం పేరుకుపోవడం వంటి వాటిపై దృష్టి పెట్టి ,శానిటేషన్ పనులు ముమ్మరంగా చేపట్టాలన్నారు. ఆయా గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను వాడుకులోకి తీసుకురావాలన్నారు. వాటర్ ట్యాంకులను క్లీనింగ్ చేయించాలని ,క్లోరినేషన్ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య బృందంతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించి, వైద్యం అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గృహ నిర్మాణాల లక్ష్యం తదితర వాటిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారామరాజు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఏపీవో భాగ్యల, ఏఈ రాజు పాల్గొన్నారు

హాజరైన అధికారులు

మదర్ థెరిసాకు ఘన నివాళి

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలో అప్పలరాజుపురం గ్రామంలో లలితాదేవి వృద్ధాశ్రమంలో మదర్ తెరిసా వర్ధంతి వేడుకలు వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాళ్ళ వెంకటలక్ష్మి ఘనంగా నిర్వహించారు. మాదిగ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మూర్తా శ్రీనివాసరావు మదర్ తెరిసా చిత్రపటానికి పూలమాల తో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కుష్టు వ్యాధితో బాధపడుతున్న రోగులను ఆదరించి వారికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఎంతోమంది చేయూతనిచ్చి సహకరించడంతోనే ఈ వృద్ధాశ్రమం నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సభ్యులు దంతులూరు గంగాభవాని ,మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కొటకల సూర్యనారాయణ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:స్థానిక శాఖా గ్రంధాలయంలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, మధర్ థెరిస్సా వర్ధంతిలను గ్రంధాలయాధికారి దమయంతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు, పాఠకులు రాధాకృష్ణన్, మదర్ థెరిసా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, యువతీయువకులు పాల్గొన్నారు.

చీడికాడలో నివాళి అర్పిస్తున్న సంస్థ నిర్వాహకులు, వృద్ధులు

నగదు ఇస్తున్న నాయకులు

రూ.20 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోటవురట్ల:ఇటీవల పందూరు వరహానదిలో గల్లంతై మృతి చెందిన సుంకర పెద పోతురాజు కుటుంబ సభ్యులకు 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గురువారం జరిగిన పోతురాజు పెద్దకర్మ సందర్భంగా కుటుంబ సభ్యులకు రైతు సంఘం నుంచి 10000, సరుగుడు కర్రల వ్యాపారి 10000 రూపాయలు అందజేశారు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయం ఇంతవరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుంకర బాబ్జి, వైసీపీ నాయకులు రమేష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కోమార రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడమ్మ పండగ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో కృష్ణదేవిపేట గ్రామంలో గురువారం మరిడమ్మ అమ్మవారి పండుగను గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిరి సత్యంనాయుడు, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు, పందిరి వెంకటరమణ, మువ్వల బుజ్జి, గుడివాడ శివాజీ, చిన్ని, పి.శివపాతాళ రాము, వరహాల బాబు తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

పోలీసుల సమక్షంలో ప్రేమ వివాహం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో బుధవారం రాత్రి పోలీసుల సమక్షంలో ప్రేమ వివాహం జరిగింది. వివరాల్లోకి వెళితే... కోటవురట్ల శివారు గవరపేట గ్రామానికి చెందిన వేగి సాయి, రాట్నాల పాలెం గ్రామానికి చెందిన మునగాడ సీతలు గత ఏడాది కాలంగా ప్రేమించుకుంటున్నారు.సీత ఎనిమిది నెలల గర్భవతి కావడంతో వివాహం చేసుకోవాలని సాయిని కోరింది. తొలుత కుటుంబీకులు ఒప్పుకోక పోవడంతో సాయి కుటుంబ సభ్యుల సహకారంతో రెండు రోజుల క్రితం 100 కు ఫోన్ చేసింది. స్పందించిన జిల్లా పోలీసు అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఇరువురిని స్టేషన్కు రప్పించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.పోలీసులు ఇరువురి గ్రామ పెద్దల సహకారంతో స్థానిక శివాలయంలో వివాహం జరిపించారు.ఈ కార్యక్రమంలో ఇరువురి తల్లిదండ్రులు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, రాంబాబు, వార్డు సభ్యులు హరి, ఏఎస్ఐ గంగరాజు పాల్గొన్నారు.

కోణాం జలాశయానికి భారీగా వరద నీరు

ప్రజాశక్తి- చీడికాడ:అల్పపీడనం కారణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాగులు, గడ్డలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. కోణాం జలశయం నిండి కుండను తలపిస్తుంది. కోనాం జలాశయ నీటి సామర్థ్యం గణనీయంగా పెరగడంతో అధికారులు అప్రమత్తమై గురువారం ఒక ప్రధాన గేటు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కోనాం జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ఇటీవల ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు జలశయానికి 1300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో నీటిమట్టం 99.50 మీటర్లకు చేరింది. జలశయం నుండి హై లెవెల్ రివర్ స్లూయిస్ ద్వారా 80 క్యుసెక్కులు, హై లెవెల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. జలాశయంలో నీరు అత్యధికంగా చేరడంతో అధికారులు అప్రమత్తమై రెండో నెంబర్ గేటు 3 అంగుళాల మేర ఎత్తి 200 క్యూసెక్కుల నీరును దిగువకు విడుదల చేస్తున్నారు. నీరు తగ్గుదల అయితే గేట్లు దించడం జరుగుతుందని, లేనిపక్షంలో గేట్లు ఎత్తి ఇంకా నీరు విడుదల చేయడం జరుగుతుందని ఇరిగేషన్ ఏఈ జైరాం విలేకరులకు తెలిపారు. దిగువ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ బి.వి రాణి హెచ్చరించారు.

కోణాం నుంచి విడుదలవుతున్ననీరు

రావణాపల్లి రిజర్వాయర్ నీటి విడుదల

గొలుగొండ:మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ గేట్లను గురువారం శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ చేతులు మీదుగా గేట్లు ఎత్తి ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావణపల్లి రిజర్వాయర్ ఆయకట్టు కింద సుమారు 3వేల ఎకరాలలో రైతులు పంటలు సాగు చేస్తున్నారని వివరించారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 358 క్యూబిక్ మీటర్ల కాగా, ప్రస్తుతం 215 క్యూబిక్ మీటర్ల నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మరమ్మత్తులకు గురైన గేట్లు స్థానంలో కొత్త గేట్లు మంజూరు చేశారని, వాటిని త్వరలో పెట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, గొలుగొండ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

రావణాపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్న విజయ్

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: భారీ వర్షానికి పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాలకు బొండం పంచాయతీ కరకవలస, బలియగూడ, గ్రామాలకు చెందిన 20 ఎకరాలు పంట పొలాలు నీటి మునిగిందన్నారు. నఆష్టపోయిన పంటపొలాలు పరిశీలించారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు మాట్లాడుతూ, పొలాలు నేల మట్టం అవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కిల్లో బుజ్జి బాబు, గుబ్బియి మల్లేష్, సుబ్బారావు పాల్గొన్నారు.